క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ల నిర్మాణం నిమిత్తం ముగ్గురోడ్డు ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

చెత్త గ్రేడింగ్‌కు స్థల పరిశీలన

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సేకరించిన చెత్తను గ్రేడింగ్ చేసేందుకు ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి బుధవారం స్థల పరిశీలన చేశారు. నగరపాలక సంస్థ వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 50 టన్నుల వరకు చెత్త వస్తోందని, ఆ చెత్తను గ్రేడింగ్ చేసేందుకు పలు ప్రాంతాల్లో స్థల పరిశీలన చేస్తున్నట్లు శారదాదేవి తెలిపారు. డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు ప్రవీణ్, కిషోర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షిక మహోత్సవాలు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయ 13వ వార్షిక మహోత్సవాలు గురువారం నుంచి మూడు రోజులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం గణపతిపూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, రక్ష సూత్రధారణ, ఛండీ, దుర్గా అమ్మవారి ప్రధాన కలశస్థాపన నిర్వహిస్తామన్నారు. 7వ తేదీన గణపతి, రుద్ర హోమం, మండప ఆవాహిత దేవతాహోమాలు గీతాభజన మండలి వారిచే లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ చేస్తారని చెప్పారు. 8న అమ్మవారికి విశేష అలంకారం సహస్రనామ అర్చన కార్యక్రమాలు అర్చకుడు రాజేంద్రశర్మ నిర్వహిస్తారని తెలిపారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు.

మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం




ఫిరంగిపురం: మతిస్థిమితం లేని బాలిక కనిపించకుండా పోవడంపై బుధవారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని శాంతిపేటకు చెందిన శ్రీను, గౌతమిల కుమార్తె హెప్సీబా(12) కు మతిస్థిమితం లేదు. ఈనెల 3న తల్లిదండ్రులు కూలిపనులకు వెళుతూ కుమార్తెను ఇంటివద్దనే ఉంచివెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకొని ఇంటికి వచ్చేసరికి కుమార్తె హెప్సీబా కనిపించలేదు. చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో తల్లి గౌతమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

నూతన పైపులైను నిర్మాణం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి 15వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో బుధవారం కార్పొరేషన్ అధికారులు కొత్త తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ ప్రవీణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే పర్యటించిన సందర్భంలో పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారని, వెంటనే ఆయన సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడెక్కడ కొత్త తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలో పరిశీలించాలని అన్నారు. 15వ వార్డులో 1000 మీటర్ల మేర పైపులైను నిర్మాణాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండడంతో రూ.15 లక్షల వ్యయంతో కొత్త తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా తాడికొండ తెలుగు బాప్టిస్టు చర్చిలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 150 మంది రోగులకు బీపీ, షుగర్, చర్మ వ్యాధులు, గుండె నరాలు, బ్రెయిన్, కీళ్ల నొప్పులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు జ్యోతుల మురళీ కృష్ణ, ఎస్.సునీల్, బి.వంశీ, బి.హర్ష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఐలవరం(భట్టిప్రోలు): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన ఉద్దంటి లక్ష్మి కాంతం(55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం రాత్రి గ్రామంలోని పైడమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం మృతదేహం చెరువులో తేలియాడుతుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని బయటకు తీయడంతో లక్ష్మీకాంతంగా గుర్తించారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- వాడవాడలా ఘనంగా మాజీ ఉప ప్రధాని జయంతి వేడుకలు



బస్టాండ్ సెంటర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



ఫిరంగిపురంలో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ కత్తిరేణమ్మ



తాడికొండలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కత్తెర సురేష్ కుమార్

మంగళగిరి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కొనియాడారు. దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం నగరంలో పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. తొలుత ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్కే జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రసంగిస్తూ సమ సమాజం కోసం బాబూ జగ్జీవన్ రామ్ నిరంతరం కృషి చేశారన్నారు. పేద కుటుంబంలో పుట్టిన బాబూ జగ్జీవన్ రామ్ తన ప్రతిభా పాటవాలతో అనేక పదవులు అలంకరించి దళిత జనబాంధవుడుగా నిలిచి ఉపప్రధాని స్థాయికి చేరుకుని దళిత, బడుగు, బలహీన వర్గాల కొరకు పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయసాధనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. జగ్జీవన్ రామ్ ఆశయాన్ని సాధించినపుడే దేశంలో సమ సమాజం ఏర్పడుతుందన్నారు. బాబూ జగ్జీవన్ రామ్‌కు భారతరత్న అవార్డును తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ, అధికార ప్రతినిధి పచ్చల శ్యాంబాబు, పట్టణ విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, కలకోటి స్వరూపారాణి, జిల్లా కార్యదర్శులు ఈపూరి ఆదాం, దాసరి వీరయ్య, మల్లవరపు సుధారాణి, దుగ్గిరాల సర్పంచ్, సీనియర్ నాయకులు మహ్మద్ ఇక్బాల్, మోహన్‌రావు, ఎస్సీ, ఎస్టీ రైట్స్ ఎండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, ఈపూరి రవి, బెజ్జం రాజాజీ, వడ్డేశ్వరపు రజనీకాంత్, తోట శ్రీను, కుంచాల కృష్ణ కిషోర్, బేతపూడి నరసయ్య, కట్టెపోగు ఉదయభాస్కర్, ఆంజనేయులు, జ్యాట్రు ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో గల ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. నాయకులు చందోలు విక్టర్ పాల్, కలకోటి నాగేశ్వరరావు, పి.భాస్కరరావు, ఎ.నాగేశ్వరరావు, కె.రామారావు, ఎస్.రాజేష్, జి.నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో బుధవారం మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తాడేపల్లి నులకపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద వున్న జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప దార్శనీకుడైన బాబూ జగ్జీవన్ రామ్ అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు మేకా వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల దాసు, బాలసాని అనిల్, సంపూర్ణ పార్వతి, మహేష్ రెడ్డి, కె.రమేష్, సయ్యద రసూల్, చిలుకోటి శ్రీనివాస మధు, గాలయ్య, కుంచాల శ్రీను, చిన్నపోతుల దుర్గారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఉపాధ్యాయ యూనియన్ ఎస్టీయూ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులర్పించారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి తమ్మన్న, మండల అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణలు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లోని సచివాలయాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు, అధికారులు బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. దుగ్గిరాలలో గర్ల్స్ హాస్టల్ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, బీసీసెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), సొసైటీ ప్రెసిడెంట్, కొండూరు ఎంపీటీసీ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్

తాడికొండ: భారతదేశ మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం, ఎస్సీ కాలనీ లైబ్రరీ సెంటర్‌లో ఉన్న జగ్జీవన్ రామ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయన కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడైన జగ్జీవన్ రామ్ 72 సంవత్సరాల జీవిత కాలంలో 52 సంవత్సరాల పాటు రాజకీయంగా అనేక పదవులు అలంకరించాడని కొనియాడారు. జగ్జీవన్ రామ్ జీవితం నేటి తరాలకు ఆదర్శం అన్నారు. ఆయన వెంట సర్పంచి తోకల సరోజిని, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు రాచకొండ సాంబశివరావు, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి తోకల నరసింహారావు ఉన్నారు.

- తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు దావులూరి పోతురాజు, ఐ కార్ప్స్ జనరల్ సెక్రటరీ కావూరి రత్నకుమార్, మున్నంగి కోటేశ్వరరావు, గొల్లపూడి మహేష్, కట్టెపోగు నాగరాజు, కావూరి రాజేశ్వరరావు, కట్టెవరపు రాము, నూనె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో తుళ్లూరు సీఐ ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తుళ్లూరు పీహెచ్‌సీలో పలువురు రోగులకు పండ్లు అందజేశారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: దేశంలో పేద వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి ఎనలేనిదని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ జి.చంద్రం, షేక్ అబ్దుల్ గఫార్, చిట్టా అంజిరెడ్డి, ఆర్.రంజన్‌బాబు, మెల్కియా, బి.అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, వి.రాము పాల్గొన్నారు.



తుళ్లూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ ఆనందరావు

బాబూ జగ్జీవన్ రామ్ పుస్తకావిష్కరణ..



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన అధిరోహించిన ఉన్నత పదవులపై రచించిన పుస్తకాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ యు.శారదాదేవిలు ఆవిష్కరించారు. నగర పరిధిలోని నవులూరులో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బాబూ జగ్జీవన్‌రామ్ విద్యాపీఠంలో పరిశోధనా విద్యార్థిగా ఉన్న పిడతల అభిషేక్ రచించిన పుస్తకాన్ని అందరూ చదవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈపూరి శేషగిరిరావు, ఈపూరి రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

గండాలయ స్వామి కొండ అభివృద్ధికి కృషి



వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగర ప్రజలకు ఆధ్యాత్మికం, ఆహ్లాదంతో పాటు నగరానికి విచ్చేసే సందర్శకుల కోసం గండాలయ స్వామి కొండను పర్యాటక, ఆధ్మాతిక, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగరంలో వేంచేసియున్న గండాలయ స్వామి కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను దాతలతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని అందించేలా పార్కులు, టెక్కింగ్ ట్రాక్, టెంపుల్ హిల్ ఎక్కోపార్కును అభివృద్ధి పర్చడం జరుగుతుందన్నారు. నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి నృసింహస్వామి, పానకాల లక్ష్మీ నృసింహస్వామి, గండాలయ స్వామి దర్శనానికి వచ్చేవారికి ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా గండాలయ స్వామి కొండను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆలయ ఈఓ రామకోటిరెడ్డి, దాతలు దేవతి భగవన్నారాయణ, దామర్ల నరసింహం, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు శివాలం ట్రస్టుబోర్డు సభ్యులు కొల్లి మునలారెడ్డి, అద్దంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లారస్ లేబొరేటరీతో కేఎల్‌యూ ఒప్పందం



తాడేపల్లిరూరల్: హైదరాబాద్‌కు చెందిన లారస్ లేబొరేటరీతో తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు సీఎఫ్ఓ వీవీ రవికుమార్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారని అన్నారు. లారస్ మరియు కేఎల్ఈఎఫ్ పరిశోధన, అభివృద్ధి, విద్య, మరియు బహుళ క్రమశిక్షణా రంగాలలో దీర్ఘకాలిక ప్రాతిపదికన కలిసి పనిచేయడానికి రెండు సంస్థలు ఆసక్తితో ఈ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. రసాయన శాస్త్రం, ఫార్మసీ, బయోటెక్నాలజీ సంబంధిత రంగాల్లో మరింత పురోభివృద్ధిని సాధించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ ఎన్.వెంకటరామ్, ఎంహెచ్ఎస్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.చక్రవర్తి, రసాయన శాస్త్రం విభాగ అధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, మానవ విభాగం ఆచార్యులు డి.సునీత పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'

- తాడికొండలో సందడిగా జగనన్న ఆసరా చెక్కుల పంపిణీ
- పాల్గొన్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: మహిళల స్వయం స్వావలంభన, ఆర్థికాభివృ drhDకి అండగా ఆసరా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసి ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పాదయాత్రలో మహిళల కష్టాలను స్వయంగా తెలుసుకొని వారిని ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చిన జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి 4 విడతలలో రుణమాఫీ చేయడం జగనన్న చిత్తశుద్ధి పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 78.74 లక్షల స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు రూ.19,137 కోట్ల రుణమాఫీ చెల్లించారన్నారు. సకాలంలో తిరిగి రుణాలను చెల్లించే సంస్కృతిని ప్రోత్సహించేందుకు రూ.3 లక్షల వరకు బ్యాంకు రుణాలు కలిగి ఉన్న స్వయం సహాయక సంఘాలపై వడ్డీ భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఎన్నికల ముందు మహిళలకు డాక్వా రుణాలు మాఫీ చేస్తానని ప్రకటించిన చంద్రబాబు ఎన్నికల అనంతరం మహిళలను మోసం చేశాడని మండిపడ్డారు. రాజధానిలో నిరుపేదలకు చోటు కల్పించేందుకు ఆర్–5 జోన్‌లో 54 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంటే అడ్డుకుంటూ కోర్టులో తప్పుడు కేసులు వేస్తున్న బాబు అండ్ కోకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేని అభివృద్ధి, సంక్షేమ ఫలాలను పేదలకు అందించిన జగనన్న చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారనడంలో సందేహం లేదన్నారు. ఈ సందర్భంగా తాడికొండ మండలంలో 1262 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.10.79 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ ఆవిష్కరించారు. జడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, గ్రామ సర్పంచి తోకల సరోజినీ, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు బెజ్జం మహేష్ బాబు, బిక్కి శివరామకృష్ణ, మాదాసు రత్నకుమారి, రావెల శైలజ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, రాఘవరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఎంపీడీఓ బిక్కి మహేష్ బాబు, డీటీ కాకుమాను ప్రసాద్, ఏపీఎం సాంబశివరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు సత్వర పరిష్కారం

మంగళగిరి: గత 40 సంవత్సరాలుగా రోడ్డులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఓ మహిళ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ను కలసి ఆవేదన వ్యక్తం చేయడంతో గంట వ్యవధిలోనే తానే స్వయంగా నగరపాలక సంస్థ అధికారులను వెంటబెట్టుకుని మరీ వెళ్లి వెంటనే గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించిన వైనమిది. వివరాలలోకి వెళితే మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం శివ కామేశ్వర గుడి సమీపంలో నివశిస్తున్న ఎం.సూర్యలక్ష్మి అనే మహిళ బుధవారం నవులూరులో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆర్కేను కలసి తన గోడు వెళ్లబోసుకుంది. గత నాలుగు దశాబ్దాలుగా రోడ్డు లేదని, చిన్నపాటి వర్షం కురిసినా డ్రైనేజీ పొంగి వర్షంనీరు తటాకాన్ని తలపిస్తుంటుందని ఆవేదన వ్యక్తం చేసింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వాపోయింది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే గంట వ్యవధిలోనే నగరపాలక సంస్థ అధికారులతో యర్రబాలెం చేరుకున్నారు. వెంటనే గ్రావెల్ రోడ్డు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రహదారి మార్గంలో విద్యుత్ స్తంభాలను కూడా వేయించి వీధిలైట్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్‌లో సూచించారు. తమ సమస్యల పరిష్కారానికి గంట వ్యవధిలోనే ప్రత్యేకంగా చొరవ తీసుకున్న ఎమ్మెల్యే ఆర్కేకు స్థానిక మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అదే ప్రాంతంలోని మరో వీధిని పరిశీలించి వెంటనే గ్రావెల్ తోలించి రోడ్డు వేయాలని అధికారులకు సూచించారు. తమకు మున్సిపల్ కుళాయి నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని స్థానిక వీధి వాసులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే నవులూరు గోలివారితోటకు చేరుకుని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన రహదారి సమస్యను పరిశీలించారు. వీలైనంత త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, దానబోయిన నాగయ్య పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవిత ఘటనల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ నందిగం సురేష్

ఉద్దండరాయునిపాలెం (తాడికొండ): డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితంలో జరిగిన యదార్థ సంఘటలకు సంబంధించిన పుస్తకాన్ని బుధవారం బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఆవిష్కరించారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన స్వగృహంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయన ఏఎన్‌యూ పరిశోధన విద్యార్థి పిడతల అభిషేక్ రచించిన నవభారత నిర్మాత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ జీవిత విశేషాలను పొందుపరుస్తూ పుస్తకం రచించడం అభినందనీయమని, మహనీయుల జీవిత విశేషాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 5 దశాబ్దాల పాటు పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలందించడం గరివ్వంచదగ్గ విషయమని, ప్రతి ఒక్కరూ ఆయన జీవిత విశేషాలను తెలుసుకోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో బేతపూడి రాజేంద్ర కుమార్, బూదాల సలోమీ, పెందుర్తి సౌమ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణం

అత్తోట(కొల్లిపర): మండలంలోని అత్తోట శివాలయంలో మంగళవారం రాత్రి శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పీటలపై దండా రాఘవయ్య, దండా వెంకటేశ్వరరావు దంపతులు కూర్చున్నారు. ఆలయ చైర్మన్ దండా సాంబశివరావు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించారు.


ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నాగేశ్వరరావు



కృష్ణారావు



ప్రజ్ఞపూర్ణాచారి

తెనాలి: తిరుపతిలో ఈనెల 9,10 తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు పట్టణ, పరిసరాలకు చెందిన పలువురు కవులు, రచయితలకు ఆహ్వానం లభించింది. ఐఎస్ఓ గుర్తింపును పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవాసంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో, చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. రెండురోజుల వేడుకల్లో కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు జరుగుతాయి. ఈ కార్యక్రమాలకు పట్టణానికి చెందిన కవి, ఆర్టీసీ ఉద్యోగి ఆళ్ల నాగేశ్వరరావు, రంగస్థల కళాకారుడు దేవిశెట్టి కృష్ణారావు, రూరల్ మండలం కొలకలూరుకు చెందిన నూతక్కి ప్రజ్ఞపూర్ణాచారికి ఆహ్వానం లభించింది. సాహితీ బ్రహ్మోత్సవాల్లో వీరు కవితా గానం, కళా ప్రదర్శన చేస్తారు.

సీపీఎం సీనియర్ నేత రత్నకిషోర్ మృతి

తెనాలి: విశ్రాంత ఉద్యోగి, సీపీఎం సీనియర్ నాయకుడు మాతంగి రత్నకిషోర్ (73) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందిన ఆయన కొద్దిరోజుల కిందట స్వగ్రామం చేరుకుని మంగళవారం మృతి చెందారు. రూరల్ మండలం గుడివాడకు చెందిన రత్నకిషోర్ సుదీర్ఘకాలంలో సీపీఎం తెనాలి తాలూకా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఏలూరులో ఉద్యోగంలో ఉన్నపుడు మధ్యతరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులుగానూ చురుకైన పాత్ర పోషించారు. సీపీఎం ఉద్యమ కార్యాచరణలో కీలకంగా పనిచేసినట్టు పార్టీ సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. గతంలో గ్రామసర్పంచ్‌గా పోటీచేసిన కేవలం 30 ఓట్ల తేడాతో ఓటమి చెందారని తెలిపారు. సాంబిరెడ్డితోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పట్టణ కార్యదర్శి కె.బాబూప్రసాద్, వల్లభనేని సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, వీఎస్ ప్రసాద్, చుక్కపల్లి ప్రభాకరరావు సంతాపం తెలియజేశారు.

'బాబూజీ' రెండో షెడ్యూలు ప్రారంభం



తెనాలి: మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ బయోపిక్ 'బాబూజీ' సినిమా రెండో షెడ్యూలు బుధవారం తెనాలిలో ప్రారంభమైంది. తొలి షాట్‌ను బాలీవుడ్ నటి శ్వేత ఝా, అమీర్‌పై చిత్రీకరించారు. జగ్జీవన్‌రామ్ 115వ జయంతి సందర్భంగా స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపం ప్రాంగణంలో చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత షెడ్యూలు ఈ నెలాఖరు వరకు ఉంటుందని తెలిపారు. తొలి షెడ్యూలులో జగ్జీవన్‌రామ్ , ఆయన కుమార్తె, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ పాత్రల్లో నటిస్తున్న మిలటరీ ప్రసాద్, తాళ్లూరి రామేశ్వరిపై తొలి షెడ్యూలులో కొన్ని సన్నివేశాల్ని తీసినట్టు దిలీప్‌రాజా గుర్తుచేశారు. నిజ జీవిత కథ కావడంతో మూలాల నుంచి సమగ్ర అధ్యయనంతో ఒక్కో షెడ్యూలును ప్లాన్ చేస్తున్నామని, వచ్చే ఏడాది విడుదల చేయాలనే తలంపుతో ఉన్నట్టు వివరించారు. కెమెరామెన్ వంశీ, ప్రొడక్షన్ మేనేజరు పినపాటి సురేష్ బాబు, చిన్నికృష్ణ, శ్రీనునాయక్ పాల్గొన్నారు.